

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
08 పేజీలు | శుక్రవారం 27 అక్టోబర్ 2023 | www.navatelangana.com

రైతులే ముఖ్యం

- రాహుల్‌గాంధీ వర్సెర్ రైతులకు మధ్యన ఎన్నికలు
- మైనార్టీలను కాంగ్రెస్ ఓటు బ్యాంకుగానే చూసింది
- మీడియా చిట్‌చాట్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

వార్త మెయిన్ పేజీలో...



పెద్దగుట్టకు వెళ్తే జాగ్రత్త సుమా..!

- అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఎలుగుబంట్లు
- ప్రమాదం నుంచి ముగ్గురిని కాపాడిన పోలీసులు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే మేలంటున్న ప్రజలు

8లో...



కార్మికుల సమస్యలను మ్యానిఫెస్టోలో చేర్చాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.రమ
- సీఐటీయూ అనుబంధ సంఘాల ముఖ్యనాయకుల విస్తృత స్థాయి సమావేశం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.రమ

నవతెలంగాణ-కామారెడ్డి

కార్మికుల సమస్యలను రాజకీయ పార్టీలు మ్యానిఫెస్టోలో పెట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.రమ డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా సీఐటీయూ అనుబంధ సంఘాల ముఖ్యనాయకుల విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రమ మాట్లాడుతూ.. కార్మికుల మ్యానిఫెస్టో తయారు చేశామని, అన్ని రాజకీయ పార్టీలకు అన్ని రకాల కార్మికుల మ్యానిఫెస్టోను వారి వారి రాజకీయ పార్టీలలో పెట్టాలని అందజేశామని తెలిపారు. గత తొమ్మిదేండ్లుగా పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇతర రాజకీయ పార్టీలు కార్మికులను పర్మినెంట్ చేస్తామని, కనీస వేతనాలు 26,000 ఇస్తామని, కార్మిక రంగాలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఆయా రాజకీయ పార్టీలు మ్యానిఫెస్టోలో పెట్టలేదని తెలిపారు. ▸ మిగతా 2లో...

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- ప్రచార సరళి, ఎన్నికల వ్యయాన్ని నిశితంగా పరిశీలించాలి
- నిఘా బృందాలకు కలెక్టర్, సీ.పీ దిశానిర్దేశం



మాట్లాడుతున్న కలెక్టర్, సీపీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురికావాల్సి వస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా వాస్తవాలను నిర్ధారించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంతో బాధ్యతతో కూడుకుని ఉండే ఎన్నికల విధులను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలన్నారు. రాష్ట్ర శాసనసభ -2023 ఎన్నికలను పురస్కరించుకుని స్టాస్టిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర నిఘా బృందాల అధికారులకు గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయా పార్టీలు, అభ్యర్థుల ప్రచార సరళి పరిశీలన, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీల నిర్వహణ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు.

▸ మిగతా 2లో...

మరోసారి అవకాశమివ్వండి

- మిగిలిన పనులు పూర్తి చేస్తా
- రాష్ట్ర ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే హన్మంత్ షిండే

8లో...



ఎంపీ బీబీ పాటిల్‌కు తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-జుక్కల్

జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి.. గురువారం మద్నూర్ మండలంలో ఎన్నికల ప్రచారం నిమత్తం హైదరాబాద్ నుంచి వస్తున్న క్రమంలో జుక్కల్ మండలంలోని జుక్కల్ చౌరస్తా వద్ద ఎంపీ వాహనానికి ఎదురుగా బైక్‌పైన వేగంగా ఇద్దరు వచ్చి పడిపోయారు. దీంతో ఎంపీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి కారును కంట్రోల్ చేసే క్రమంలో డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారు ముందు చక్రం పేలింది. కాగా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆ యువకులు బైక్ తీసుకుని పారిపో యారు. అనంతరం ముఖ్యమంత్రి సభావేదిక పనులను పరిశీలించారు. ఘటనా స్థలానికి కౌలాస్ సర్పంచ్ గొల్ల హన్మండ్లు, ఇతర నాయకులు వచ్చి మరో వాహనంలో ఎంపీని ప్రచారానికి తీసుకెళ్లారు.



పేలిన కారు టైరు

ఎన్నికల నియమావళి పాటించాలి

- జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్



నవతెలంగాణ-తాడ్వాయి

ఎన్నికల కమిషన్ నియమావళి మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రకటనలకు సంబంధించి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నుండి ముందస్తుగా అనుమతి పొందిన వాటినే ప్రసారం, ముద్రణ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఛానళ్లలో ప్రసారాలకు, ప్రింట్ మీడియాలో ప్రకటనలకు సంబంధించి ముందస్తుగా అనుమతి పొందకుండా ప్రచురించడం, ప్రసారం చేయడం ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు వస్తుందని, ఆ ఖర్చును అభ్యర్థి పేర చూపించడం జరుగుతుందని అన్నారు. నామినేషన్ వరకు ఖర్చును ఆయా పార్టీల ఖాతాలో, నామినేషన్ వేసినప్పటి నుండి అభ్యర్థి ఖర్చు కింద చూయించడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థి పేర వారి అనుచరులు ఖర్చు చేసిన ఆ ఖర్చు అభ్యర్థి ఖాతాలో చూయించడం జరుగుతుందని, ఒక వేల అభ్యర్థి సమ్మతించకుంటే ▸ మిగతా 2లో...

c m y k

కార్మికుల సమస్యలను మ్యానిఫెస్టోలో చేర్చాలి

మొదటిపేజీ తరువాయి

ఒక వైపు అంగన్వాడీ, ఆశావర్కర్లు, మున్సిపల్ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు, బీడీ కార్మికులు, అలాగే అసంఘటిత కార్మికులు ఏ కార్మిక రంగానికి చెందిన ఒక్క మ్యానిఫెస్టోను ఆ రాజకీయ పార్టీలు పెట్టలేవని తెలిపారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు కార్మికుల మ్యానిఫేస్టోను రాజకీయ పార్టీ మ్యానిఫేస్టోలో పెట్టాలని అలాగే నిరుద్యోగులకు నోటిఫికేషన్ వేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పాలడుగు సుధాకర్, జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, సీఐటీయూ నాయకులు వెంకట్ గౌడ్, రాజనర్సు, రవళి, బిల్డింగ్ యూనియన్ జగదీశ్, సత్యం, అంగన్వాడీ కల్పన, సునంద, ఆశా పద్మ, అనిత, మిడ్డేమీల్స్ సరస్వతి, రాజమని, సోమలింగం, ఐకేపి శివరాం, అనసూయ, కిశోర్, మున్సిపల్ మహిబూబ్, దీపక్, వీరయ్య, దీవెన, మిషన్ భగీరథ అనిల్, శేషికుమార్, 104 సంతోష్, స్వామి, గ్రామపంచాయతీ బాలునర్సు, శ్యామ్, సుమర్ 200 మంది ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

మొదటిపేజీ తరువాయి

పబ్లిషర్‌పై చర్య తీసుకుంటామని అన్నారు. ప్రకటనలకు సంబంధించిన స్క్రిప్ట్, వీడియో, ఖర్చు, తదితర వివరాలను నిర్ణీత దరఖాస్తు ఫారం వెంట సమర్పించాలని, వాటిని పరిశిలించి ఎం.సి.ఎం.సి. కమిటీ ఆమోదం తెలుపుతుందని అన్నారు. అనుమానిత చెల్లింపు వార్తలపట్ల (పేడ్ న్యూస్) అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా సామాజిక మాధ్యమాలలో బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజిలు, సినిమా హాళ్లలో, రేడియోలలో ప్రకటనలకు సంబంధించి ముందస్తుగా అనుమతి పొందాలని సూచించారు. అదేవిధంగా నిబంధనలననుసరించి ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్ ముద్రించేటప్పుడు తప్పనిసరిగా అనుమతి పొందాలని సూచించారు. వాటిపై ప్రింటర్, ప్రచురణ కర్త పేరు, చిరునామా, సెల్ ఫోన్ నెంబర్,, ప్రతుల సంఖ్య తో పాటు ప్రింటింగ్ చార్జీల వివరాలను , ముద్రితమైన ప్రచార సామగ్రి, పబ్లిషర్ ఇచ్చిన డిక్లరేషన్ కాపీని సమర్పించాలని సూచించారు. అసత్య వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వచ్చిన మెస్సేజ్‌లో వాస్తవం గ్రహించి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. పోలింగ్‌కు 2 రోజుల ముందు సైలెన్స్ పీరియడ్ చాలా కీలకమని న్యూస్ రిపోర్టింగ్‌లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, అధికారులు ఏమి చేయాలో, ఏమి చేయకూడదో నిర్దిష్టంగా ఉందని, ఆ మేరకు నడుచుకోవాలన్నారు. సభలు, సమావేశాలకు, లౌడ్ స్పీకర్‌లకు, వాహనాలకు ముందస్తుగా అనుమతి పొందాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం నిరంతరం పర్యవేక్షిస్తుందని, సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని, ఎన్నికలకు సంబంధించి ఏదేని సమాచారం కొరకు 1950కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ అన్నారు. సమావేశంలో నోడల్ అధికారులు కిషన్, సింహారావు, శాంతికుమార్, సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దేవి నిమజ్జనంలో అపశృతి

- **చెరువులో పడి యువకుడి మృతి**

నవతెలంగాణ-వర్ని

మండలంలోని పాత వర్ని గ్రామంలో బుధవారం రాత్రి దేవి మాత నిమజ్జనంలో యువకుడు చెరువులో మునిగి మృతి చెందిన ఘటన చోటుచేసుకొంది.. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంచిప్ప సాయిలు (23) బుధవారం రాత్రి దేవి నిమజ్జనం చేసేందుకు గానూ గ్రామ చెరువుకు వెళ్లాడు. నిమజ్జనం చేసే క్రమంలో కాలుజారి చెరువులో పడి నీటమునిగి మృతిచెందాడు. స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించినా విఫలమైంది. మృతుడికి భార్య విరామణి, కుమారుడు ఉన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-లింగంపేట్

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బానాపూర్ గ్రామానికి చెందిన ముదాం రవీందర్ (33) హైదరాబాద్‌లో వారం క్రితం తన స్వగృహంలో కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది క్షణికావేశంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం కామారెడ్డికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వైద్యుల సూచన మేరకు హైదరాబాదులోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. గత వారం రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ బుధవారం పరిస్థితి విషమించి మరణించాడు. మృతునికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని తండ్రి కిష్టయ్య, తల్లి ఎల్లమ్మ ఇంటికి పెద్ద కొడుకు మృతి చెందడంతో వారి రోదనలు మిన్నంటాయి.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండలంలోని పెద్దటాక్లీ గ్రామ అంగన్వాడీ ఆయమ్మ జనాబాయి మృతిచెందడంతో వీరి అంత్యక్రియలో అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సురేష్ గొండ పాల్గొన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేశారు. అంగన్వాడి యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు సచిత, రాజశ్రీ, టీచర్లు సుజాత, ప్రేమల, అనసూయ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఐదు రాష్ట్రాలలో శాసన సభ ఎన్నికలు జరుగుతుండగా, ఎన్నికల వ్యయం విషయంలో ఎలక్షన్ కమిషన్ తెలంగాణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నిఘా బృందాలు సమర్ధవంతంగా, నిబద్దతతో నిర్వహించాలని హితవు పలికారు. ఎన్నికల సంఘం నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని, అన్ని పార్టీలు, అభ్యర్థుల పట్ల నిబంధనలకు అనుగుణంగా సమదృష్టితో వ్యవహరించాలన్నారు. తమపట్ల వివక్షను ప్రదర్శించారనే ఫిర్యాదులు రాకుండా పక్కాగా విధులు నిర్వర్తించాలని సూచించారు. నిఘా బృందాల దృష్టిని మళ్లించేందుకు పలువురు చేసే తప్పుడు ఫిర్యాదుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, అలాంటి వాటిపై తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల వ్యయం, ప్రచార సరళిపై నిఘా బృందాలు అనునిత్యం 24 గంటలు నిఘా ఉంచాలని, ఈ మేరకు పూర్తిస్థాయిలో బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. స్టాస్టిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర బృందాలకు సమకూర్చిన వాహనాలకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన పీ.టీ.జీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా నిఘా బృందాల పనితీరును కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని, అదేవిధంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయంలోనూ లైవ్ ఫీడింగ్ పరిశీలన ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 22 చెక్‌పోస్ట్‌ల వద్ద కూడా పీ.టీ.జీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నిబంధనలకు అనుగుణంగా సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ముఖ్యంగా తనిఖీల సమయంలో సాధారణ ప్రజలకు అనవసర ఇబ్బందులు ఏర్పడకుండా సంయమనంతో వ్యవహరించాలని, నగదును జప్తు చేసిన సందర్భాలలో తగురీతిలో పంచనామా నిర్వహించి తప్పనిసరిగా రశీదులు అందించాలని ఆదేశించారు. అంతేకాకుండా తగిన ఆధారాలను చూపించి నగదును విడిపించుకునే వెసులుబాటు ఉంది అనే విషయాన్ని వివరించాలని, జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ గురించి తెలియజేయాలని సూచించారు. ఆయా పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన రేట్ కార్డును అనుసరిస్తూ లెక్కింపు చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు అంకితభావంతో కృషి చేయాలని, ఎన్నికల నియమావళి తు.చ తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల వ్యయం, ప్రచార సరళి, ప్రలోభాల విషయంలో నిఘా బృందాలు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, ఎన్నికల వ్యయం నోడల్ అధికారి పాపయ్య, ట్రెజరీ శాఖ ఉప సంచాలకులు కె.దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. వ్యక్తి మృతి

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు నారాయణ కాంబ్లే (60) అనే వ్యక్తి ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో మృతి చెందారు. ఆయన కుమారుడు దత్తు కాంబ్లే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. ఈనెల 25న రాత్రి 7 గంటలకు రెంజల్ నుంచి అంబేద్కర్‌నగర్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న నీలా గ్రామానికి చెందిన షేక్ జహీర్ అనే వ్యక్తి అతివేగంగా, అజాగ్రత్తగా బైకు నడుపుతూ ఢీకొట్టడంతో నారాయణ కాంబ్లే కింద పడి కాళ్లు చేతులతో పాటు తలకు గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోని మృతి చెందారు. అజాగ్రత్తగా నడిపి ఢీ కొట్టిన షేక్ జహీర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రికార్డుల తనిఖీ

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డీఆర్‌డీఏ ప్లాంటేషన్ మేనేజర్ సురేందర్ గురువారం ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా చేపట్టిన పనుల రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గరిబున్నిసా బేగం, ఎంపిడిఓ మల్లికార్జున్‌రెడ్డి, ఏపీఓ తులసిరాం, టీఏలు, ఫీల్డ్ అసిస్టెట్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని నెహ్రూనగర్ సర్పంచ్ అమానుల్లా షరీఫ్ గురువారం మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, జైతాపూర్ సర్పంచ్ లక్ష్మి రాంగోపాల్ రెడ్డి, బిల్లా రామ్మోహన్, ఆ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలున్నారు.

మూడు గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ పార్టీ కావాలా

24 గంటల కరెంట్ అందించే బీఆర్ఎస్ పార్టీ కావాలా

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

మూడు గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ పార్టీ కావాలా? 24 గంటల కరెంట్ అందించే బీఆర్ఎస్ పార్టీ కావాలా ? అని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాళ్ళ రాంపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం గురువారం జరిగింది. ఈసందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.... పదేళ్ళ కాలంలో ప్రతి ఇంటికి ఏదో ఒక రూపంలో అభివృద్ధి ఫలాలు, సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. ఏర్గట్ల మండల ప్రజలు నాకు ఇది కావాలి అని అడగకున్నా అన్ని చేశానని తెలిపారు. ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ కృషితో పల్లెలు అభివృద్ధి జరిగాయని అన్నారు. ఇంత అభివృద్ధి జరిగినా ప్రతిపక్ష పార్టీలు అధికార పార్టీని విమర్శించడం విడ్డురంగా ఉందని, ప్రజలు అన్ని


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

గమనిస్తున్నారని అన్నారు. నా పార్టీ, ప్రతిపక్ష పార్టీ అని చూడకుండా అందరికి సీఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణ లక్ష్మీ ఇప్పించానని, తన, పర బేధం లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు గెలిపిస్తే ఇప్పుడున్న 2 వేల ఆసరా పెన్షన్‌ను 3 వేలు చేసి ప్రతి సంవత్సరం పెంచుతూ...5 ఏళ్ళలో 5వేలు చేస్తామని, పెన్షన్ రాని మహిళలకు సౌభాగ్య లక్ష్మీ కింద 3 వేలు, 400 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్య శ్రీ బీమా కింద 15 లక్షలు, రైతు బంధు ప్రతి సంవత్సరం పెంచుతూ...ఆఖరికి 16 వేలు చేస్తామని,కేసీఆర్ భీమా కింద ప్రతి వ్యక్తికి 5 లక్షల భీమాను అందిస్తామని, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం అందిస్తామని అన్నారు. మీ ఓట్లు డబ్బాల్లో పడగానే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు కావని, వారిని నమ్మవద్దని, గతంలో వారు చేసింది శూన్యమని అన్నారు. దళిత బంధు, రైతు బంధు ఆపేయాలన్న కాంగ్రెస్ పార్టీపై ఈ సభలో తీర్మానాన్ని ప్రవేశ పెడుతున్నానని, వారిని వెంటబడి ఓడించండని కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిస్తున్నానన్నారు. బీజేపీ పార్టీకి చెందిన కిషన్ రెడ్డి తెలంగాణ ఉద్యమ సమయంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయమంటే పారిపోయాడని, ఇప్పుడు గెలిస్తే ప్రజలకు ఏ విధంగా న్యాయం చేస్తాడని అడుగుతున్నానన్నారు .ప్రజలను మోసం చేద్దామని చూస్తున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కావాలా? ప్రజల కోసం, తెలంగాణ కోసం చావునోట్లో తల పెట్టిన కేసీఆర్ కావాలో.. ఒక్కసారి ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్, రైతు నాయకులు కోటపాటి నర్సింహ నాయుడు,డాక్టర్ మధు శేఖర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజారాం యాదవ్,బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి,జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో పోలీస్ కవాతు


పట్టణంలో పోలీస్ కవాతు

నవతెలంగాణ-ఆర్మూర్

రానున్న అసెంబ్లీ ఎన్నికలు 2023 సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకునేలా ఓటర్లకు తాము అండగా ఉంటామని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ నేతృత్వంలో గురువారం సి ఆర్ పి ఎఫ్ సిబ్బంది, సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు పోలీస్ కవాతు పట్టణంలో నిర్వహించారు . పెర్కిట్ రోడ్డు నుండి హుస్నాబాద్ గల్లీ వరకు సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్. జగదీష్ చందర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు, భీంగల్, రూరల్ సిఐలు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సమస్యలు లేకుండా చూడాలి

- ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్‌సింగ్


తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు

నవతెలంగాణ-నవీపేట్

రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్ సింగ్ తాసిల్దార్ ధన్వాల్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభమైన కొనుగోలు కేంద్రాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదని, ఎంఎస్పీ ధరలకే ధాన్యం కొనుగోలు చేయాలని, తరుగు పేరుతో దోపిడీ జరగకుండా నిలువరించాలని కోరారు. గన్ని బ్యాగులు, లారీల కొరతలను నివారించాలని, టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు మెగావత్ రామ్ సింగ్, కిషన్, గంగాధర్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు ముందు బైండోవర్


తహసీల్దార్ ముందు బైండోవర్ చేసిన పోలీసులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలానికి చెందిన ఆరుగురిని పోలీసులు తహసీల్దార్ ఎం. ఏ కలీం ఎదుట గురువారం బైండోవర్ చేశారు. గత ఎన్నికల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతి లేకుండా పార్టీ జెండాలు పెట్టుకుని ర్యాలీ నిర్వహించిన వారిని ముందస్తుగా హెచ్చరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆరు నెలల వరకు ఎన్నికల నిబంధనలు ఉల్లంగిచారదని. మద్యం అమ్మ రాదని తెలిపారు. ఒకవేళ మళ్లీ పట్టుబడితే ఆరు నెలల జైలు శిక్ష రెండు లక్షల వరకు జరిమానా ఉంటుందని హెచ్చరించారు.

గోసంగి కులస్తులపై చిన్నచూపు తగదు

- సంక్షేమ పథకాలు, పదవుల్లో అన్యాయం
- గోసంగిల అభివృద్ధికి కృషి చేయలేదు
- సమస్యలు తీర్చే వారికే మద్దతు
- మండల ప్రధాన కార్యదర్శి గంధం చిరంజీవి

నవతెలంగాణ-ఆర్మూర్

గోసంగి కులస్తులపై చిన్న చూపు తగదని, ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి ఇచ్చిన మద్దతుపై వ్య న రా లో చి స్తా వం ని, నియోజకవర్గంలో గోసంగిలకు చేసిన అభివృద్ధి శూన్యమని మండల ప్రధాన కార్యదర్శి గంధం చిరంజీవి గురువా రం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎస్సీ కులానికి చెందిన గోసంగిలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అత్యంత వెనుకబడి ఉన్నారని, వారి అభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడంలేదని జిల్లా గోసంగి సంఘం అధ్యక్షులు గంధం రాజేష్ ఇటీవల అసహనం వ్యక్తం చేశారని తెలిపారు. జిల్లా సంఘం పిలుపు మేరకు అన్ని నియోజకవర్గాల్లో గోసంగి కుల సంఘం అభివృద్ధిపై సర్వే చేపట్టడం జరిగిందని, ఏ గ్రామంలో కూడా మా కులస్తుల అభివృద్ధికి కృషి చేయలేదని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుండి నేటి వరకు బీఆర్ఎస్ పార్టీకి ఏకగ్రీవ తీర్మానం చేసి మద్దతు ఇస్తున్నామని, 2014-18 రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో జిల్లా గోసంగి సంఘం కులస్తులందరు ఏకగ్రీవ తీర్మానం చేసి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కూడా గోసంగి కులస్తులను పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. గోసంగి కులస్తులకు సంక్షేమ పథకాల్లో, రాజకీయ పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో ఎమ్మెల్యేలు అన్యాయం చేశారని అగ్రహం వ్యక్తం చేశారు. హామీలు ఇవ్వడమే కానీ ఒక్కటి అమలు చేయ లేదని తెలి పారు. నియోజకవర్గంలో ఎస్సీ కులాల్లో మాల, మాదిగ కులాల తర్వాత గోసంగి కులస్తులు అత్యధిక జనాభా కలిగి ఉన్న ఒక్కరికీ కూడా పార్టీలో గుర్తింపు దక్కలేదని పేర్కొన్నారు. అన్ని కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలు కేటాయించిన ప్రభుత్వం గోసంగి కుల సంఘానికి కేటాయించక పోవడం బాధాకరమని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై నమ్మకం సన్నగిల్లిందని, వారం రోజుల్లో రాబోయే ఎన్నికల గురించి తమ కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు. గోసంగిల డిమాండ్స్ నెరవేర్చే వారికే దయ మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు.

నియామక పత్రం అందజేత


నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండల కేంద్రంలో బిజెపి నాయకులు రుయ్యడి రాజేశ్వర్ గురువారం మత్స్యకార నాయకులు బట్టు లక్ష్మణ్‌కు రాష్ట్ర బిజెపి ఫిషర్ మెన్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు రుయ్యాడి రాజేశ్వర్, బట్టు లక్మన్ ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాగి ప్రభాకర్. సీనియర్ నాయకులు పన్నాల రాజేశ్వర్. ఆర్ప్ గంగాధర్. బాస గంగాధర్. అనుప్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని నాగాపూర్ గ్రామంలో తంబూర్ వారి మున్నూరు కాపు సంఘం నుంచి 53 కుటుంబాలు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మాన పత్రాలను గురువారం బీఆర్ఎస్ నాయకులకు అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బాల్కొండ నియోజవర్గంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అభివృద్ధి వైపు తమ ఓటు అంటూ సంఘం తీర్మానం చేసిన పత్రాలను బీఆర్ఎస్ నాయకులకు అందజేశారని తెలిపారు. ఈసందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ.. సంఘంలో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి ఓటు వేస్తామని ప్రమాణం చే స్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారని తెలిపారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి చేసిన అభివృద్ధిని మరవకుండా గ్రామ ప్రజలు భారీ మెజా రిటీతో మళ్లీ ఎమ్మెల్యే గా గెలిపించేందుకు పూర్తిమద్ధతు పలుకుతామని వారు తెలిపారు. సర్పంచ్ పెంటు పెద్ద లింబన్న, ఎంపీటిసి ఈపి నారాటయణ, ఉపసర్పంచ్ ఎంబరి మహిపాల్, బిఆర్ఎస్ నాయకులు పోలేపల్లి లక్ష్మీ నారాయణ,సభ్యులు పాల్గొన్నారు.


ఏకగ్రీత తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆదాయ, అభివృద్ధి కార్యక్రమాల వైపు మొగ్గు చూపాలి

- ఏపీఎం రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి


మాట్లాడుతున్న ఏపీఎం రవీందర్‌రెడ్డి

ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల వైపు మొగ్గు చూపాలని ఏపిఎం రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో మండల సమైక్య సమావేశం వనిత అధ్యక్షతన జరిగింది. మండలంలోని అన్ని గ్రామ సంఘాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల పొదుపు పెంచుకొని ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల వైపు ముగ్గు చూపాలని పేర్కొన్నారు. బ్యాంకు ద్వారా శ్రీనిధి ద్వారా గ్రామ సంఘాల ద్వారా రుణాలు తీసుకొని న్యూ ఎంటర్ప్రైజెస్ నెలకొల్పాలని సూచించారు. ఆక్వా కంపెనీ ద్వారా చేపల పెంపకం పైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల మహిళా రైతులు ముందుకు వచ్చి తమకున్న వరి పొలంలోని నాలుగు గుంటల భూమి కేటాయించినట్లయితే చేపల పెంపకానికి అనువగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు వనిత మండల సమైక్య ప్రతినిధులు అన్ని గ్రామాల నుంచి వచ్చిన గ్రామ సంఘాల అధ్యక్షులు కమ్యూనిటీ కోఆర్డినేటర్లు మండల సమైక్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకతాయిల అడ్డా

ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ

- పట్టించుకోని పోలీసులు
- దొంగతానికి విఫలయత్నం

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలోగల ఎంపిడిఓ కార్యాలయ ఆవరణ ఆకతాయిల అడ్డాగా మారిందని, రాత్రయితే చాలు గప్పాలు కొట్టేందుకు కొందరు ఇక్కడే అర్ధ రాత్రివరకు తిష్టవేసి ఉంటారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. కనీసం పోలీసులు పట్టించుకోవడంలేదిన కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. మొన్న ఈమధ్య ఓయువకుడు రాత్రి ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న నివాసపు ఇంట్లో దొంగతనానికి యత్నించి విఫలయత్నం చెందాడని తెలిసింది. అర్ధరాత్రి సమయంలో శబ్దానికి గమనించిన ఓమహిళ మేలుకొని ఇంట్లోకి ఎవరో దొంగతనానికి వస్తున్నట్లు గమనించిన 100కు డయల్ చేసింది. అప్పటికే పెట్రోలింగ్ లోఉన్న ఎస్ఐ వంశీ కృష్ణ ఘటనా స్థలానికి తన సిబ్బందితో చేరుకున్నారు. ఇంతలో పారిపోయాడు. ఈఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముందుగానే సమీపంలోని ఓ హెూటల్లో పథకం పన్ని అక్కడే చెప్పులు వదిలి వెళ్లినట్లు తెలిసింది. స్థానికుడుగా కొందరు గుర్తించినట్లు గుసగుసలు వినిపిస్తున్నయి. అదేరాత్రి సదరు దొంగ దొంగతనానికి పాల్పడి పారిపోతున్న సందర్భంలో సమీపంలో ఉన్న దుర్గాదేవి మండపం వద్దనున్న కొందరుభక్తులు గమనించినట్లు కాలనీవాసులద్వారా తెలిసింది. ఈ ఘటనపై బహిరంగంగా ప్రజలు చర్చించుకుంటున్నప్పటికీ పోలీసులు ఎందుకు పట్టించుకోవడంలేదని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈఘటనలో అనుమానితుడు పాలీసులకు తెలిసినా పట్టుకోవడంలో ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని అనుకుంటున్నారు. మరోపక్క కాలనీకి చెందిన ఓపెద్దాయన అనుమానితుడిగా భావిస్తున్న వ్యక్తికి మంగళవారం రాత్రి తన వద్దకు పిలిపించుకొని చితక బాది హెచ్చరించి వదిలినట్లు తెలిసింది. ఇంత జరిగినప్పటికీ పోలీసుల వ్యవహారం అర్థం కావడంలేదని కాలనీవాసులు ముక్కున వేలేసుకుంటు న్నారు. ఏదేమైనప్పటికీ నిత్యం వందల వాహనాలు, ప్రజలు సంచరించే రహదారి పక్కనే ఉన్న నివాసంలో ఇలాంటి ఘటన జరగటంపై కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఈఘటనపై ఎస్ఐ వంశీ కృష్ణకు వివరణ కోరగా జరిగిన సంఘటన వాస్తవమేనని, ఇంటి వారు 100కు సమాచారం ఇవ్వగా తాము అప్పటికే రాత్రి పెట్రోలింగ్ చేస్తూ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించామన్నారు. కొంత క్లూ వచ్చినప్పటికీ విచారణకు మరింత సేకరించే పనిలో ఉన్నామని తెలిపారు. అనుమానితున్ని అతి త్వరలో పట్టుకుంటామని అన్నారు. అలాగే ఫిర్యాదు దారులకు కలిసి ధైర్యంగా ఉండాలని, తాము ఉన్నామని భరోసా కల్పిస్తున్నారని తెలిసింది. ఇప్పటికైనా రాత్రి వేళల్లో పెట్రోలింగ్ సందర్భంలో పెద్దవాహనాల్లో కాకుండా, ద్విచక్ర వాహనాలపై పెట్రోలింగ్ నిర్వహిస్తే నిందితులు దొరికె అవకాశంతోపాటు, నేరాలు కొంతమేర తగ్గే అవకాశం ఉంటుందని ప్రజలు విన్నవిస్తున్నారు.

నేడు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతాదారుల సమావేశం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని గన్నారం గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులు, రైతులు, తదితరులతో సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నామని టీజీబీ గన్నారం మేనేజర్ టక్కూరు సంతోష్ గురువారం తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ రీజనల్ మేనేజర్ శ్రీపురం నవీన్ కుమార్ హాజరవుతున్నారని, ఖాతాదారులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఇన్సూరెన్స్ కలిగి ఉండి మృతి చెందిన కుటుంబానికి రీజినల్ మేనేజర్ చెక్కును అందజేయడం జరుగుతుందని అన్నారు. బ్యాంకుల ద్వారా రైతు ఇతరత్రా రుణాలు, వడ్డీ తదితర అంశాలపై రీజినల్ మేనేజర్ క్లుప్తంగా వివరిస్తారని తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీలో పలువురి చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు, యువకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్ళ రాంపూర్ గ్రామంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత సమావేశంలో పాల్గొనడానికి గురువారం వచ్చిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీకి చెందిన నాయకులు, యువకులు బీఆర్ఎస్‌లో చేశారు. ఏర్గట్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం రమేష్,దొబ్బల రమేష్,బట్టాపూర్ గ్రామానికి చెందిన బత్తుల సంజీవ్,తాళ్ళ రాంపూర్ కు చెందిన వడ్డెర కాలనీకి చెందిన సుమారు 20 మంది, ఏర్గట్లకు చెందిన సుమారు 100 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి,జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్ ,తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



నందిపేట్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-నందిపేట్

ముస్లిం మైనార్టీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు . గురువారం నందిపేట్ మండల కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన 'నందిపేట్, డొంకేశ్వర్ మండల మైనారిటీ' ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు మైనార్టీలను పట్టించుకోలేదని బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే మైనారిటీలు అభివృద్ధి చెందారని ఆయన అన్నారు. ముస్లిం మైనార్టీ మహిళల కోసం షాది ముబారక్ పథకాన్ని కేసిఆర్ అమలు చేశారని గుర్తు చేశారు. రానున్నరోజుల్లో ముస్లింలు అభివృద్ధి చెందే విధంగా మరిన్ని పథకాలు తమ ప్రభుత్వం తీసుకువస్తుందని తెలిపారు. ముస్లింలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమతోనే ఉన్నారని, ఇప్పుడు కూడా బీఆర్ఎస్‌తోనే ఉండి తనను ఆశీర్వదించాలన్నారు. వచ్చే నెల 3 తారికున సీఎం కేసీఆర్ ఆర్మూర్‌కి వస్తున్నారని, ముస్లిం మైనారిటీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం ముస్లిం మైనారిటీ పెద్దలు ఆయనను పూలమాలతో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఖాదీర్, ముస్లిం మైనారిటీ నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ మున్నాభాయ్ ,కౌన్సిలర్ ఫయాజ్, ఇంతియాజ్, మండల నాయకులు కో.అప్షన్ మెంబర్ సయ్యద్ హుస్సేన్, ఉస్మోద్దిన్ ,పాష ,జావిద్ మండల కన్వీనర్ రఫీ , ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి చేస్తా

ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

నవతెలంగాణ - మాక్లూర్

మరో సారి తనకు అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముల్లంగి(బి), బొంకన్‌పల్లి, ఆలూర్ మండలంలోని గుత్ప గ్రామాల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ప్రజాఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సార్లు ప్రజలు నన్ను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించారని, గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని మళ్ళీ ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని, పథకాలను, మెనిపెస్టోను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కనిగంటి పావని, సాయమ్మ, గంట చిన్నయ్య, ఎంపిపి మస్తా ప్రభాకర్, ఎంపిటిసి పూజిత, నాయకులు శ్యామ్ రావు, రంజిత్, అమృత్, అమ్రద్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్థ శాస్త్ర విభాగంలో

దీప్తి, మహేశ్‌లకు పిహెచ్‌డి డాక్టరేట్



దీప్తిని సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో అర్థ శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థులు టి.దీప్తి, జి. మహేశ్ లకు పిహెచ్. డి.డాక్టరేట్ అవార్డులను ప్రదానం చేశారు. హిమాచల్ ప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ బి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పరిశోధకులు టి.దీప్తి మహిళా పారిశ్రామిక వేత్తలపై ఆర్థిక సామజిక ప్రభావాలు అనే అంశంపై, జి. మహేష్ నిజామాబాద్ జిల్లాలోని సూక్ష్మ తరహా పరిశ్రమల పనితీరుపై సిద్ధాంత గ్రంధాలను రూపొందించి తెలంగాణ యూనివర్సిటీకి సమర్పించారు. అందుకు గాను గురువారం (బహిరంగ మౌఖిక పరీక్ష) నిర్వహించారు. ఈ వైవా కార్యక్రమాన్ని విభాగాధిపతి డాక్టర్. ఏ పున్నయ్య అధ్యక్షతన వహించగా పాఠ్యప్రణాళిక అధ్యక్షులు టి .సంపత్ సమన్వయం చేశారు. ఇందులో డాక్టర్ పాత నాగరాజు-అసోసియేట్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ కె. రవీందర్‌రెడ్డి, డా. స్వప్న, రాంబాబు, స్రవంతి, డాక్టర్ శ్రీనివాస్, దత్తహరి, దేవిదాస్, తిరుపతి, ప్రసాద్ పాల్గొన్నారు.

అల్పాహార పథకం ప్రారంభం



అల్పాహారం పథకాన్ని ప్రారంభించిన ఎంఈవో

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని భీంగల్, పిప్రి, దేవనపల్లి , బాచన్ పల్లి గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని మండల విద్యాధికారి స్వామి గురువారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసి కమిటీ చైర్మన్లు, తదితరులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- డీపీవో డాక్టర్ జయసుధ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ ప్రభుత్వం ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం అమలు చేస్తున్న ఎల్ఆర్ఎస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జయసుధ సూచించారు. గురువారం మండలం లోని ధర్మారం(బి), నడిపల్లి గ్రామాల పరిధిలో కొనసాగుతున్న ఎల్ఆర్ఎస్ పనులను ఆమె ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల ప్లాట్లను కొలతలు నమోదు చేయడాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీవో పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఒక్క నడిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోనే 2300 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆయా ఇళ్ల ప్లాట్ల యజమానులకు అవగాహన కల్పించి వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఎల్ఆర్ఎస్ చేసుకుంటే ఆ ప్లాట్లో ఇంటి నిర్మాణం అనుమతి పొందవచ్చని, ఇతరులకు విక్రయించవచ్చని, బ్యాంకు రుణం తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్పీవో నాగరాజు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు నిట్టు కిషన్ రావు, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఎల్ఆర్ఎస్‌ను పరిశీలిస్తున్న డీపీవో

ఫ్రీ అండ్ ఫెయిర్ ఎలక్షన్ నిర్వహించేలా కృషి చేయాలి

● అంతర్రాష్ట్ర ఎక్సైజ్ అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్‌లోని హెూటల్ కృష్ణాలో మహారాష్ట్ర, తెలంగాణ ఎక్సైజ్ అధికారుల సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అదిలాబాద్ జిల్లా డిప్యూటీ కమిషనర్ నరసింహ రెడ్డి, నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్, అదిలాబాద్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, నాందేడ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అతుల్ కన్నాడే, నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, కామారెడ్డి ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్, అదిలాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ, మహారాష్ట్ర, నాందేడ్ జిల్లా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు ఆర్పిఎఫ్, జీఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాలకు మహారాష్ట్ర సరిహద్దు ఉండడం వల్ల రానున్న ఎన్నికల్లో మహారాష్ట్ర నుండి తెలంగాణకు మద్యం, గంజాయి, దేశిదారు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందువల్ల ఎన్నో రాష్ట్రాల అధికారులు సమన్వయం చేసుకొని అక్రమ మద్యాన్ని ఉక్కుపాదంతో అరికట్టి ఫ్రీ అండ్ ఫెయిర్ ఎలక్షన్ నిర్వహించుటకు కృషి చేయాలని సమన్వయంగా చర్చించారు.

కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మొద్దు

- రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి
- బాజిరెడ్డికి హ్యాట్రిక్ విజయం అందించాలి
- నుడా చైర్మన్ సంజీవరెడ్డి
- ఈసారి కూడా ఆశీర్వదించాలి
- ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్
- రెడ్డి బంధు ఆత్మీయ సమ్మేళనం


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు సురేష్‌రెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం (పి) శివారులోగల మోట్టాడి రెడ్డి ఫంక్షన్ హాల్ లో నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా రెడ్డి బంధు ఆత్మీయ సమ్మేళనం గురువారం ఏర్పాటుచేశారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ స్పీకర్, ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్‌రెడ్డి హాజరయ్యారు. రెడ్డిబంధు ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి మాట్లాడుతూ... రెడ్డి సభ్యులందరం ఈఎన్నికల్లో బాజిరెడ్డి గోవర్ధన్‌కోసం కలిసికట్టుగా పనిచేయాలని, మన ఇంట్లో మన సోదరుడు నిలబడితే ఏ విధంగా కష్టపడతామో అదేవిధంగా అందరం బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు కొరకు కలిసికట్టుగా పనిచేసే 50 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించి తీరాలని హ్యాట్రిక్ విజయం అందించాలని తెలిపారు. రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యే కూడా తన నియోజకవర్గంలో రెడ్డి కుల సంఘాలకోసం నాలుగు కోట్ల నిధులు కేటాయించలేదని, అన్ని నిధులు కేటాయించిన ఏకైక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అని అన్నారు. నిరుపేద రెడ్డీలకు సీఎం రిలీఫ్‌ఫండ్ అందించారని తెలిపారు. అలాంటి వ్యక్తి హ్యాట్రిక్ విజయం సాధించే తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేయాలని దానికి స్థలంతో పాటు కోటి రూపాయలు మంజూరు చేయాలని కోరగా బాజిరెడ్డి గోవర్ధన్ వెంటనే ఏర్పాటు చేస్తానని ఆయన మాట ఇచ్చారని తెలిపారు. మాజీ స్పీకర్, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ బాజిరెడ్డి గోవర్ధన్‌తో నలభై సంవత్సరాల నుండి మంచి స్నేహం ఉందని తెలిపారు. రాజకీయాలు వారసత్వంగా, కొందరు తమ రాజకీయ గురువుల దగ్గర నేర్చుకుంటే మేం ఇద్దరం మాత్రం సిరికొండ, చీమనుపల్లి దట్టమైన అడవుల్లో నేర్చుకున్నామని అన్నారు. ఇంతకుముందు పాలించిన ప్రభుత్వాలు రైతులకు అది చేస్తాం.. ఇది చేస్తామని చెప్పారని, కేసీఆర్ మాత్రం రైతుబంధు, రైతు బీమా రూపంలో ప్రతి రైతును ఆదుకున్నాడని అన్నారు. పదిసంవత్సరాల క్రితం తెలంగాణ ఎలా ఉండేదో.. ఇప్పుడు ఎలా ఉందో.. ఒకసారి రెడ్డి సోదరులు ఆలోచించాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బిజెపి పార్టీ పరిస్థితి ఢిల్లీలో ఒకటి గల్లీలో ఒకటిలా ఉంటుందని, కేవలం రిమోట్ మొత్తం ఢిల్లీలో ఉంటుందని వారు నిమిత్తమాత్రులే అని వారి మాటలు నమ్మొద్దని తెలిపారు. కేసీఆర్‌తో మాట్లాడి నిరుపేద రెడ్డిల కోసం హాస్టల్ ఏర్పాటు చేసే విధంగా చూస్తామని ఆయన తెలిపారు. పసుపు బోర్డుపై ఉన్న అనుమానాలను పార్లమెంటులో ప్రస్తావించి కచ్చితంగా పసుపు రైతులకు మద్దతు ధర అందే విధంగా చూస్తానని అన్నారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ చిన్ననాటినుండి రెడ్డి కుల స్నేహితులే ఉండేవారని, రెడ్డిలకు వ్యతిరేకిని కాదని, తన కోడలు కూడా రెడ్డి కులానికి చెందిన అమ్మాయి అని అన్నారు. సంతోష్ రెడ్డి తన రాజకీయ గురువు అని తెలిపారు. రెండవసారి రాజకీయ భిక్ష పెట్టింది కూడా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు. ఈ మ్యానిఫెస్టో కూడా వ్యవసాయ రంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని, దాదాపు రెడ్డి సోదరులందరూ వ్యవసాయంపైన ఆధారపడి ఉంటారని తెలిపారు. మంచిప్ప ప్రాజెక్టుపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని, మంచిప్ప ప్రాజెక్ట్ లెఫ్ట్ సైడ్ పైప్ లైన్ ద్వారా మింట్రాజ్ పల్లి తదితర గ్రామాలకు నీరందుతుందని అన్నారు. రైట్ సైడ్ పైప్లైన్ ద్వారా 80 వేల ఎకరాలకు సాగు తాగునీరు అందుతుందని తెలిపారు. ఈసారి కూడా ఆశీర్వదించాలని, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఉన్నత నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు. కార్యక్రమంలో ధర్పల్లి జెడ్పిటిసి కో బాజిరెడ్డి జగన్, మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్, జిల్లా ఒలంపిక్ సంఘము ఉపాధ్యక్షులు ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్, ఐడిసిఎం ఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, కోర్వ దేవేందర్, ఎన్‌డిసిసి బ్యాంక్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, అభిలాష్ రెడ్డి ఈగ శ్రీనివాస్ రెడ్డి, జెడ్పిటిసిలు గడ్డం సుమన రెడ్డి సుమలత రెడ్డి, తనుజా రెడ్డి, ముత్యం రెడ్డి, రాజారెడ్డి, రెడ్డి సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, రెడ్డి కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్సీ కవిత


బతుకమ్మ పేరుస్తున్న కవిత

బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులుగా శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులుగా ఏరుకొండ శ్రీనివాస్ గౌడ్ ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సర్పంచ్ తెలు విజయ్ కుమార్, ఎంపిటిసి కచ్చుకాయల అశ్విని శ్రీనివాస్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఅర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు కోసం ప్రత్యేకంగా అందరూ కలిసి కట్టుగా కృషి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ నవీన్ గౌడ్, నర్సయ్య, హౌస్ల రమేష్, యూసుఫ్ అలీ, శ్రీకాంత్ శాఫి మహమ్మద్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

● పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్ ఆమేర్

నవతెలంగాణ - బోధన్

బోధన్ నియోజకవర్గంలోని ఎడపల్లి మండలంలో గురువారం బతుకమ్మ సంబరాలను మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. దసరా పండుగ తర్వాత ఎడపల్లి మండలంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించుకుంటారు. ఈ సంవత్సరం బతుకమ్మ సంబరాలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే షకీల్ ఆయేర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కవిత జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలతో కలిసి పూలు పేర్చుతూ బతుకమ్మలు చేశారు. అనంతరం మండలం నుంచి తరలివచ్చిన మహిళ ప్రజా ప్రతినిధులు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి పాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ త్వరలో 21 సంవత్సరాలు దాటిన ఆడపిల్లల కోసం ప్రభుత్వం సౌభాగ్య లక్ష్మి పేరుతో ప్రత్యేక పథకం తీసుకొచ్చి ప్రతి ఆడపిల్లకు మూడు వేల చొప్పున ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపారు. కావున బీఆర్ఎస్ పార్టీకి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ సతీమణి ఆయుషా ఫాతిమా, మండలంలోని మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువతులు పాల్గొన్నారు

ప్రతిపక్ష నాయకులు ఎంగిలి మెతుకుల కోసం ఎగబడుతున్నారు... ఎమ్మెల్యే షకీల్ ఆమేర్

ప్రతిపక్ష పార్టీ నాయకులు వారికి ఏ మండలంలో కూడా బూత్ కమిటీలు లేకున్న, కార్యకర్తలు లేకున్నా కావాలని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను చీల్చుతూ వారి పార్టీలో చేర్చుకుంటున్నారని, ఇలా ఎంగిలి మెతుకుల కోసం ఎగబడటం వారు మానుకోవాలని ఎమ్మెల్యే షకిల్ ఆమేర్ హెచ్చరించారు. ఎడపల్లిలో పాల్గొన్న కార్యక్రమంలో మాట్లాడుతూ దసరా అనంతరం ఎడపల్లి మండల కేంద్రంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకమని అన్నారు. కొంతమంది నాయకులు వారికి పార్టీ క్యాడర్ లేకున్నా, నాయకులు లేకున్నా తమ కార్యకర్తలకు ప్రలోభ పెట్టి పార్టీలో చేర్చుకోవడం వారి దీన పరిస్థితికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఇలా ఎంగిలి మెతుకుల కోసం తాపత్రయపడటం వారి అవేకానికి నిదర్శనమని అన్నారు. వారికి కనీసం మెజారిటీ రాదని తెలిసి కూడా జనం కాళ్లు పట్టుకుంటున్నారని అన్నారు. 75ఏండ్ల వయసులో ఇంకా పదవులపై ఆశ పెట్టుకొని గ్రామాలు తిరగడం సిగ్గుచేటని అన్నారు. ఆయన వెంట నాయకులు ఆత్మేల శ్రీనివాస్, దేరడి శ్రీరామ్, డిసిసిబి డైరెక్టర్ గంగారెడ్డి, ఎంపీపీ శ్రీనివాస్ తదితర నాయకులు ఉన్నారు.

సద్దుల బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అమీర్‌నగర్ గ్రామంలో బతుకమ్మ ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పెద్దఎత్తున బతుకమ్మలు తీసి చప్పట్లు, కోలాలు, డీజె. చప్పుళ్ల పాటల మధ్య కనువిందు చేసే నృత్యాలు చేస్తూ చూసే వారిని ఆకట్టుకున్నారు. అత్తవారి ఇండ్లలో నుండి పుట్టింటి ఊరికి వచ్చి ఎంతో ఇష్టంగా ఆడే బతుకమ్మ ఆడవాళ్ళ పెద్ద పండుగ భావించే ఆడ బిడ్డలు, పుట్టింటి ఆడపడుచులు గ్రామానికి వచ్చి బతుకమ్మ పండుగలో పాల్గొన్నారు. తీరొక్క పూలను పేర్చి అలంకరించి పసుపు గౌరమ్మను మధ్యలో నిలిపి కొలిచే ఈ సంప్రదాయం కేవలం తెలంగాణకే సొంతం. మల్లచ్చే ఏటి వరకు చల్లగా పోయి రా అంటూ బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మలను నీటిలోకి సాగనంపారు. అనంతరం వెంట తెచ్చిన సద్దుల ప్రసాదాలు పంచుకొని తింటూ బతుకమ్మ సంబరాలను ముగించారు.

రైతులు కాంగ్రెస్‌కు ఘోరీ కట్టడం ఖాయం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రైతులు కాంగ్రెస్‌కు ఘోరి కట్టడం ఖాయమని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతుబంధు ఆపాలని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదుపై ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులు గురువారం టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను డిచ్ పల్లి, ఇందల్ వాయి మండల కేంద్రాలలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఇందల్‌వాయి ఎంపీపీ బదావత్ రమేష్ నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు చిలువేరి దాస్, సీనియర్ నాయకులు శక్కరి కొండ కృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ రైతు వ్యతిరేక వైఖరి ప్రదర్శిస్తుందని, ఇంకోపక్క రైతులకు అండగా ఉంటామని భరోసా కల్పిస్తు మొసలి కన్నీరు కారుస్తుందని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను ఆరునూరైనా అమలు చేసి తీరుతమన్నారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షులు సాయిలు, సర్పంచులు తెలు విజయ్ కుమార్, మోహన్ నాయక్, ఎంపిటిసి చింతల దాస్, బాబు రావు, ప్రధాన కార్యదర్శి పులి శ్రీనివాస్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నయీమ్, నాయకులు పాల్గొన్నారు.

సిబ్బంది కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న పోలీస్ అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎ. దయానంద్ రావ్-ఎస్ఐ-పోలీస్ కంట్రోల్ రూమ్, నిజామాబాద్ గుండెపోటుతో మరణించగా భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కు రూ.15,93,280 గురువారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ శింగెనవార్ దయానంద్ రావ్ సతీమణి మంజులకు అందజేశారు. అదనపు డిప్యూటీ పోలీస్ కమీషనర్ (ఎ.ఆర్) గిరిరాజు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకీల్ పాషా వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

చేపూర్ దత్తసాయి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ దత్త సాయి ఆలయ సన్నిదానంలో గురువారం అన్నదాత పెర్కిట్ కు చెందిన లక్ష్మి నరసింహ స్వామి,సునిత ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేపూర్ సర్పంచ్ ఇందూరు సాయన్న,ఎంపీటీసి బాల నర్సయ్య,ఆలయ కమిటీ అధ్యక్షులు రాజారెడ్డి, గౌరవ అధ్యక్షులు, కోశాధికారి సురేష్ రుక్మాజీ మాట్లాడుతూ... అన్నదాతలుగా రూ.6వేలు చెల్లిస్తే వారిపేరున అన్నదాన కార్యక్రమం నిర్వహించ బడుతుందన్నారు.

8 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 8 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ తెలిపారు. పట్టుబడిన వారితోపాటుతో 16 మందికి గురువారం నగరంలోని జిల్లా టిటిఐ కౌన్సిలింగ్ సెంటర్లో కౌన్సెలింగ్ నిర్వహించారు.

దళితుల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్

- మాదిగల ఆర్థిక వృద్ధి కోసం దళిత బంధు
- మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త

నవతెలంగాణ-కంఠేశ్వర్

దళితుల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ అని, మాదిగల ఆర్థిక వృద్ధి కోసం దళిత బంధు ప్రవేశపెట్టారని మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త అన్నారు. జనార్దన్ గార్డెన్స్‌లో మాదిగ ఆత్మీయ సమ్మేళనంలో గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలని స్థాపించి దళితులకు నాణ్యమైన విద్యని ఉచితంగా అందిస్తుందని, విదేశాల్లో చదువుకొనే ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు డా.బి.ఆర్. అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్షిప్ అందిస్తుందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరోసారి ఏర్పడ్డాక ఆసరా పింఛన్ 2016 నుండి రూ.5వేలకు, కళ్యాణ లక్ష్మీ ప్రోత్సాహకాన్ని రెండు లక్షల పెంచుతామని, కేవలం 400 రూ.లకే వంట గ్యాస్‌ని అందిస్తామని తెలిపారు. నిజామాబాద్ నగరం మరింత అభివృద్ధి చెందాలన్న, సంక్షేమం పథకాలు అమలు కావాలన్న కారు గుర్తుకి ఓటు వేసి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్, కార్పొరేటర్లు కంపల్లి ఉమారాణి ముత్యాలు, బట్టు రాఘవేందర్, మాజీ కార్పొరేటర్ కనకం సుదా సదానంద్, మాదిగ సంఘం నాయకులు సిద్ధి రాములు, దండు శేఖర్, మందమరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లోగల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచారు. ఎన్నికల నిర్వహణ కోసం శాసనసభ నియోజకవర్గ కేంద్రాలకు రాండమైజేషన్ ద్వారా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను ఇటీవలే తరలించిన విషయం విదితమే. తరలింపు పూర్తయిన మీదట ఇంకనూ ఈవీఎం గోడౌన్‌లో మిగిలి ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించి, నిబంధనలను అనుసరిస్తూ వాటిని భద్రపరిచేలా పర్యవేక్షణ చేశారు. సీయూ, బీయూ, వివి ప్యాట్లకు సంబంధించిన వివరా ల గురించి అధికారుల ను అడిగి తెలుసుకుని సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

పట్టణంలో మేరా మట్టి మేరా దేశ్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

మేరా మట్టి మేరా దేశ్‌లో భాగంగా గురువారం అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు పట్టణ ఎంపీడీవో కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం కల్పించారు. ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమర వీరులకు జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ఏపీవో, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి, ఆశ, ఉపాధి హామీ, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

వెల్నెస్ సెంటర్ మార్పు



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టుల, వెల్నెస్ సెంటర్‌ను జనరల్ ఆసుపత్రి నుండి మున్సిపల్ కార్పొరేషన్ వెనుక భాగంలోనికి మార్చబడిందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్‌చ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్రావు గౌరవాధ్యక్షులు శాస్త్రుల దత్తాత్రేయరావు, ఉపాధ్యక్షులు భోజారావు, కోశాధికారి ఈవిల్ నారాయణ, కార్యదర్శి ప్రసాద్ రావు తదితరులు తెలిపారు. మార్చబడిన వెల్ నెస్ సెంటర్ ను వారు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని రకాల సేవలను అందించేందుకు ఈ వసతి సరిపోవటం లేదని అన్నారు. డెంటల్, ఫిజియోథెరపీ, ఈసీజీ, తదితర సేవలను వసతి లేక ప్రస్తుతం పొందే అవకాశం లేదని తెలిపారు. పక్కనున్న గదిని కూడా వెల్ నెస్ సెంటర్‌కు కేటాయించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

గోవింద్‌పేట్, చేపూర్‌లో ప్రచారం



ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్‌పేట్, చేపూర్, చేపూర్ కాలనీ గ్రామంలో గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారెంటీ పథకాలను వివరిస్తూ చేతి గుర్తుకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌నుండి 50 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వారికి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వినయ్ రెడ్డి పార్టీ కండువా కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రచారంలో సతీమణి అనన్య,మండల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరి కోనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంకట్రావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వరి కోనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ వెంకట్రావు అన్నారు. గురువారం డిచ్ పల్లి మండలం లోని రాంపూర్ డి సహకార సొసైటీ పరిధిలో నెలకొల్పిన వరి కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

ధాన్యానికి మ్యాచర్ వచ్చే విధంగా చూడాలని సిబ్బందికి అందేశించారు. రాంపూర్ (డి) సహకార సోసైటి పరిది లోని రాంపూర్ డి, మిట్టపల్లి, బీబీపూర్ గ్రామాల్లో ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటి చైర్మన్ తారాచంద్ నాయక్, సొసైటీ సిఈఓ నాగరాజ్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, సొసైటి పాలకవర్గ సభ్యులు, నాగేశ్వరరావు, బసప్రభు, రైతులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి

- ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 30వ తేదీన జుక్కల్‌కు ఎన్నికల ప్రచార సభకు రానున్న సందర్భంగా ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇతర పార్టీల నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మవద్దని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి అందిస్తున్న ఘనత ఆయనకే దక్కిందని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి హన్మంత్‌షిండేను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ఆయన కార్యకర్తలకు సలహాలు సూచనలు చేశారు.

కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తిర్మల్‌రెడ్డి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి

విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ ప్రారంభం



బ్రేకె ఫాస్ట్ చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే చిన్నారులకు అల్పాహారం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేంద్ర శేఖర్, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యాయులు నరేష్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ బేగరీ గంగామణి తదితరులు పాల్గొన్నారు.

పీఎంజేజేబీవై చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న బ్రాంచ్ మేనేజర్

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని తిమ్మానగర్ గ్రామానికి చెందిన గొల్ల కృష్ణయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం కింద మంజూరైన రెండు లక్షల రూపాయల చెక్కును నామిని అయిన కిష్టవ్వకు ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ కళ్యాణి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మృతుడు గొల్ల కృష్ణయ్య జీవిత బీమా నిమిత్తం ఎస్‌బీఐ బ్రాంచ్‌లో వార్షిక ప్రీమియం రూ.436 చెల్లించి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకంలో సభ్యుడై, అకాల మరణం చెందడంతో మృతుడి భార్యకు చెక్కు అందజేసినట్టు తెలిపారు. బ్రాంచ్ కస్టమర్లు 18 నుంచి 50 సంవత్సరాలలోపు గల స్త్రీ, పురుషులు తెలుపు రేషన్ కార్డు గలవారు వార్షిక ప్రీమియం రూ.436 చెల్లించి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన పథకంలో చేరి లబ్ధి పొందాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సిబ్బంది శంకర్‌గౌడ్, బాల్‌రాజు, బ్రాంచ్ సెంటర్‌ల నిర్వాహకులు అబ్దుల్ ఆఫీజ్, జీవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్/నిజాంసాగర్

మండలంలోని బాగేపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇన్చార్జి ఎపిఓ భాస్కర్ తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2183 ప్రభుత్వం అందజేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సిసి శివకుమార్, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, సీఏ బేగారి గంగామణి, గ్రామ అధ్యక్షు రాలు లక్ష్మి, కార్యదర్శి కళావతి, స్థానిక రైతు లు ఆటో సాయిలు, క్షేత్ర సహాయకుడు గోపి, అశోక్ తదితరు లు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు

నిజాంసాగర్: మండల కేంద్రంలోని పీఏసీఎస్ మల్లూరు పరిధిలో గల మల్లూరు, వడ్డేపల్లి, జక్కాపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీ ల్దార్ బిక్షపతి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి ధాన్యాన్ని సకాలంలో రైతులు కేంద్రాల వద్దకు తీసుకురావాలని, అలాగే తేమశాతం 15 కంటే ఎక్కువగా ఉండదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ అమర్ ప్రసాద్, మండల మానిటరింగ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, అబ్దుల్ హాలీం, పీఏసీఎస్ సీఈవో కోటగిరి సాయిలు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికి బీఆర్ఎస్ ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని నాలుగవ వార్డు బాలాజీనగర్ తండాలో గురువారం స్థానిక ఎమ్మెల్యే జాజల సురేందర్ ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికి బిఆర్ఎస్ మేనిఫెస్టో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అభివద్ధిని చేసి చూపించిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని తెలిపారు. మన ఎల్లారెడ్డి గడ్డపై స్థానిక శాసనసభ్యులు జాజాల సురేందర్‌ను కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్త్యాల సుజాత, కౌన్సిలర్ ఎరుకల సాయిలు, బీఆర్ఎస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు జలంధర్ రెడ్డి, ఆదిమూలం సతీష్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు శ్రవణ్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవంబర్ 1న సన్నాహక సభ

- ఎమ్మార్పీఎస్ బోధన్ నియోజకవర్గ ఇంఛార్జి ఆకారం రమేష్

నవతెలంగాణ-బోధన్‌టౌన్

నవంబర్ 18న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప బహిరంగ సభను విజయవంతం చేసేందుకు నవంబర్ 1న బోధన్ సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ బోధన్ నియోజకవర్గ ఇంఛార్జి ఆకారం రమేష్ మాదిగ తెలిపారు. గురువారం బోధన్ పట్టణంలోని రైస్‌మిల్ అసోసియేషన్లో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాలలో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలపైన, కేంద్ర ప్రభుత్వాలపైన ఒత్తిడి పెంచుతూ హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను లక్షలాదిగా మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఎస్సీ వర్గీకరణ బిల్లు న్యాయమైన డిమాండ్ అని ఆ బిల్లుని తక్షణమే పార్లమెంట్లో బిల్లు పెడతామని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. నవంబర్ 1న బోధన్ పట్టణంలో జరిగే సన్నాహక మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ బోధన్ కో ఇంఛార్జి లక్ష్మీగారి భూమయ్య, బోధన్ పట్టణ అధ్యక్షులు అబ్బయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపా ధ్యక్షులు మందర్ణ మారుతి, సాలూర కన్వీనర్ బూరె శంకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బండారి పోశెట్టి, దుబ్బాల సాయిలు, వినోద్, నగేష్, మహేష్, సంజీవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ మాదిగ

బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడి చేరిక

నవతెలంగాణ-బోధన్ టౌన్

బోధన్ పట్టణ కాం గ్రెస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాధర్ గౌడ్ బీఆర్ఎస్‌లో గురు వారం చేరారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆయ నకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించా రు. ఈ సందర్భంగా గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు బీఆర్ఎస్ ద్వారానే న్యాయం చేకూరుతుందని నమ్మి ఆ పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే షకీల్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ చేరిన కాంగ్రెస్ నాయకుడు

ఆరు పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి

నవతెలంగాణ-బోధన్‌టౌన్

ఆరు పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆచంపల్లిలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ హరికాంత్ చారి, కౌన్సిలర్ దాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పంచాయతీల రికార్డులు అప్‌డేట్ చేయాలి

- ఎంపీడీవో వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-పిట్లం

పంచాయతీల రికార్డులన్నింటినీ అప్‌డేట్ చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని కారేగావ్, గోడమేగావ్ గ్రామ పంచాయతీలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల ఆదాయ, వ్యాయాల రికార్డుల తోపాటు ఇంటి పన్ను, షాపింగ్ కాంప్లెక్స్, పల్లె ప్రగతి రికార్డులన్నీ అప్‌డేట్‌గా పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.పంచాయతీలలో ప్రజల ఆరోగ్య దృష్ట్యా మురికి కాలువలను తమ విధిగా ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని ఆదేశించారు. వాటర్ ట్యాంక్ శుభ్రపరుస్తూ తాగునీటిలో బ్లీచింగ్ పౌడర్ కలిపి స్వచ్ఛమైన నీటిని అందించాలని, తాగునీటి పైప్‌లైన్ చెడిపోతే వెంటనే మరమ్మతులు నిర్వహించి, నీటి గుంతలు లేకుండా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కారేగావ్ సర్పంచ్ దుర్గయ్య, సెక్రటరీ జాకీర్ హుస్సేన్, పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

అసైన్డ్ భూములకు పంట రుణం ఇవ్వాలి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీర్కూర్ మండలంలోని అసైన్డ్ భూములకు పంట రుణాలు ఇవ్వాలని బ్యాంక్ అధికారికి వినతిపత్రం అందజేశారు. గురువారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు నందు పటేల్, సర్పంచ్ అరిగే సాయిలు, మాట్లాడుతూ.. అసైన్డ్ భూములకు రుణాలు ఇవ్వడం లేదని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుబంధు పొందుతున్న అసైన్డ్ భూముల పట్టాదారు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్న బ్యాంకు అధికారులు పంట రుణాలు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శివ ప్రసాద్, మైనార్టీ అధ్యక్షుడు యూసుఫ్, మాజీ సర్పంచ్ శాంతయ్య, సంగ్రామ్ నాయక్ రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దగుట్టకు వెళ్తే జాగ్రత్త సుమా..!

- అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఎలుగుబంట్లు
- ఇటీవలే ప్రమాదం నుంచి ముగ్గురిని కాపాడిన పోలీసులు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే మేలంటున్న ప్రజలు


పెద్ద గుట్టకు వెళ్లేదారి

నవతెలంగాణ-వర్ని

నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలోని జాలాల్‌పూర్ గ్రామ పరిధిలో గల పెద్దగుట్ట షాదుల్లా హుస్సేన్ బాబా దర్గాను దర్శనం చేసుకోవడానికి వెళ్తే జాగ్రత్తగా ఉండాల్సిందే. దర్గా అటవీ ప్రాంతం వద్ద ఉండటం.. చుట్టూరా పచ్చదనం ఉండటంతో దర్గాను దర్శించుకునేందుకు వెళ్లిన ప్రజలు పచ్చదనాన్ని ఆస్వాదించేందుకు అటవీ లోపలికి వెళ్తుంటారు. అదే ప్రమాదం తెచ్చిపెడుతోంది.

పెద్దగుట్ట వద్ద దర్గాను దర్శించుకోవడానికి ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి ప్రజలు శుక్రవారం, ఆదివారం అధిక సంఖ్యలో వస్తారు. దర్శనం అనంతరం ప్రజలు అటవీ ప్రాంతాన్ని ఆస్వాదించేందుకు.. అటవీలో ఫోటోలు తీసుకునేందుకు అటవీ లోపలికి వెళ్తున్నారు. ఆ సమయంలో అటవీ జంతువులు సంచరించడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.

ముగ్గురిని కాపాడిన ఎస్ఐ..

ఇతర జిల్లా నుంచి బుధవారం వచ్చిన ముగ్గురు వ్యక్తులు దర్శనం అనంతరం దర్గా నుంచి 4 కిలోమీటర్లు లోనికి సెల్‌ఫోన్‌లో సెల్ఫీలు దిగేందుకు వెళ్లారు. వీరు వెళ్లిన చోట ఎలుగుబంటి కనబడటంతో భయాందోళనతో పొదల మధ్యలో దాక్కున్నారు. ఆ ముగ్గురు రాత్రి అయినా రాకపోగా వారి బంధువులు ఫోన్ చేశారు. అటవీలో ఉన్నామని ఇక్కడ ఎలుగుబంటి ఉందని తెలుపడంతో దర్గా వక్ఫ్ బోర్డు డిప్యూటీ అధికారి పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన వర్ని ఎస్ఐ బాధితుల ఫోన్ లొకేషన్ ద్వారా వారి వద్దకు అర్ధరాత్రి 2 గంటలకు వెళ్లి వారిని ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా క్షేమంగా తీసుకొచ్చినట్లు ఎస్ఐ కృష్ణకుమార్ తెలిపారు.

గతేడాది ఎలుగుబంటి దాడిలో ఒకరు మృతి..

గత ఏడాది హైదరాబాద్ ప్రాంతం నుంచి పెద్దగుట్ట దర్గా దర్శనానికి వచ్చి ఎలుగుబంటి దాడిలో ఒకరు మృతి చెందారు. ఇలా దర్గాకు వచ్చే భక్తులు దర్శనం తరువాత అటవీ లోపలకి వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రజలు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..

అటవీ శాఖ అధికారులు అటవీ లోపలకు వెళ్లకుండా జంతువులు సంచరిస్తున్నాయనే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రజలు అటవీ లోపలికి వెళ్లకుండా నివారించవచ్చునని పలువురు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ మొదటి సంతకం రుణమాఫీ కోసమే..

నవతెలంగాణ-నసురుల్లాబాద్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటి సంతకం ఆరు గ్యారంటీ పథకాలతోపాటు రెండు లక్షల రుణమాఫీ కోసమే ఉంటుందని బాన్సువాడ మున్సిపాలిటీ ఫ్లోర్‌లీడర్, కాంగ్రెస్ పార్టీ నేత కాసుల రోహిత్ తెలిపారు. గురువారం బీర్కూర్ మండల కేంద్రంలో 2వ రోజు గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తొలి సంతకం గా రెండు లక్షల రుణమాఫీని రైతులకు అందిస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్‌ను, ధాన్యానికి 2500 మద్దతు ధర కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. రైతులతో పాటు కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక పథకాలను రూపొందించిందని చెప్పారు. కార్యక్రమంలో బీర్కూరు మండల అధ్యక్షుడు బోయిని శంకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొంతూరం కాశిరం, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు యమ రాములు, మాజీ సర్పంచ్ సనేపు గంగారం, కిసాన్‌కేత్ అధ్యక్షులు పిరన్న తదితరులు పాల్గొన్నారు.

83వ రోజుకు కార్మికుల దీక్ష

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ నిజాంషుగర్స్ కార్మికులు చేపడుతున్న దీక్షలు గురువారం 83వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కార్మికులు రఘునాథ్, శ్రీనివాస్ కూర్చున్నారు. వీరికి కార్మిక సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నాగేశ్వరరావు, శ్రీనివాస్, బషీర్, షరీఫ్, ఫరూక్ నయీం తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ చెక్‌పోస్ట్ వద్ద నగదు స్వాధీనం



చెక్‌పోస్ట్ వద్ద నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం నసురుల్లాబాద్ గండి చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న డబ్బును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లావణ్య తెలిపారు. నసురుల్లాబాద్ పోలీసుల సమాచారం మేరకు

ఇందులో నిజామాబాద్ జిల్లా వినాయక్‌నగర్‌కు చెందిన వ్యక్తి నుంచి రూ.1,26,550, అలాగే బోధన్ పట్టణానికి చెందిన వ్యక్తి నుంచి రూ.70 వేలను ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న డబ్బును నసురుల్లాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు వెంకటరావు, అబిడ్ బేగ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

- ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయమని, ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఉమ్మడి జిల్లా డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత పోచారం సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం బీర్కూర్ మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘంలో మండల స్థాయి ప్రజాప్రతినిధుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 30న బాన్సువాడ పట్టణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రాక సందర్భంగా బాన్సువాడలో నిర్వహించే ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. పార్టీ బాన్సువాడ నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచన మేరకు ప్రతి ఒక్క కార్యకర్త 35 రోజులు పార్టీ సైనికుడిలాగా పనిచేసి భారీ మెజారిటీతో విజయం సాధించే దిశగా పని చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వైపు అన్ని రాష్ట్రాలు ఎలా అయితే చూస్తున్నాయో మన నాయకుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గానికి రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా అభివృద్ధి చేశారని, బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్ల ఖర్చు చేసి రాష్ట్రంలోనే అభివృద్ధిలో నెంబర్‌వన్ దిశగా తీసుకువెళ్లారని తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించడంలో,


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్లు, సీసీ రోడ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించిన ఘనత స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిదేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వచ్చి మాయమాటలు చెబుతారని ఆ పార్టీని నమ్మి మోసపోవద్దని సూచించారు. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మాణిక్‌రావు ఠాక్రే, పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతుబంధు, దళితబంధు ఆపివేయాలని ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాసి అక్కసును వెళ్లగక్కారని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ద్రోణావల్లి సతీష్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ డి.అశోక్, ఎంపిపి రఘు, జడ్పిటిసి స్వరూప శ్రీనివాస్, యువజన నేత శశికాంత్, అవారి గంగారాం, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశమివ్వండి

- మిగిలిన పనులు పూర్తి చేస్తా
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే హన్మంత్ షిండే

నవతెలంగాణ-మద్నూర్

ప్రత్యేక రాష్ట్ర సాధన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారని ప్రస్తుతం జరగబోయే ఎన్నికల్లో మరొకసారి అవకాశం ఇవ్వాలని, మిగిలిన పనులు పూర్తి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే అన్నారు. డోంగ్లి మండలంలో కుర్లా, ఎనబోరా, దోతి, మల్లాపూర్, మారేపల్లి, లక్ష్మాపూర్, మోగా గ్రామాల్లో గురువారం ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే షిండేతో పాటు ఎంపీ బీబీ పాటిల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాగుమారే లక్ష్మీబాయి, జెడ్పిటిసి సభ్యురాలు అనిత కథలయ్య,


ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బిఆర్ఎస్ పార్టీ డొంగ్లి మండల అధ్యక్షులు శశాంక్ పటేల్, మండలాధ్యక్షులు బన్సీ పటేల్, సింగిల్ విండో ఛైర్మన్, డిసిసిబి డైరెక్టర్ రామ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి ఉపసర్పంచ్..

డోంగ్లి మండలంలోని కుర్లా ఉప సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అశోక్ పటేల్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్‌షిండే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సర్పంచ్‌కు ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ

నవతెలంగాణ-మాచారెడ్డి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను ఆరోగ్య వైద్య సిబ్బంది గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యూట్రిషన్ కిట్లను గర్భిణులు సద్వినియోగం చేసుకుంటే పుట్టబోయే బిడ్డతో పాటు తల్లి ఆరోగ్యంగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


న్యూట్రిషన్ కిట్లు అందజేత

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి

నవతెలంగాణ-బోధన్‌టౌన్

లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతికి కారణమని వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ గైని గంగాధర్ డిమాండ్ చేశారు. గురువారం ఆచన్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తన 10 సంవత్సరాల పరిపాలన సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారని మళ్లీ ఇప్పుడు ఎన్నికల సందర్భంగా తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కేసీఆర్ సిద్ధమయ్యారని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ ఉచిత విద్య తాగు నీరు ఏది ఇవ్వలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కూడా కమీషన్ తీసుకొని ప్రజల సొమ్మును వేల కోట్లను దోచుకున్న కేసీఆర్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా మహిళా కన్వీనర్ అరుణ జ్యోతి, అసెంబ్లీ ఇన్చార్జ్ సింగడి పాండు, ఉపాధ్యక్షులు శంకర్, సుభాష్ మహిళలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ ఇంచార్జ్ గంగాధర్

కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలి

నవతెలంగాణ-దోమకొండ

కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మధుసూదన్ రావ్, జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గాంధీ చౌరస్తా వద్ద పీసీసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, మాజీ పీసీసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు అమలు జరుగుతున్నాయని, రైతులకు ప్రస్తుత సీజన్‌లో రైతుబంధు పథకం డబ్బులు రైతుల ఖాతాలకు విడుదల చేయవద్దని కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శారదా, ఎంపీటీసీ కడారి రమేష్, మాజీ ఎంపీటీసీ నల్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీకాంత్, నాయకులు కానుగంటి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.


దోమకొండలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


జుక్కల్‌లో...

మాణిక్ రావ్ థాక్రే దిష్టి బొమ్మదహనం..

జుక్కల్ : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ మండల నాయకులు కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జీ మాణిక్‌రావ్ థాక్రే దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నీలుపటేల్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా రైతుబంధు పథకాన్ని 2023 సంవత్సరం రబీ పంటకు రైతులకు ఇవ్వవద్దని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కలిసి లేఖను అందించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు ద్రోహి మాణిక్‌రావ్ థాక్రే అని విమర్శించారు. కార్యక్రమంలో విండో చైర్మెన్ శివానంద్, మాజీ ఎంపిపి బస్వంత్ రావ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాదారావ్ దేశాయి, మాజీ అధ్యక్షుడు నీలుపటేల్, బొల్లి గంగాధర్, మాజీ మార్కెట్ చైర్మెన్ సాయాగౌడ్, యువ నాయకుడు శివరాజ్ దేశాయి, ఇటుకబట్టి రాజు, భానుగౌడ్, రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ : మండల కేంద్రంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఎంపీపీ భర్త దుర్గారెడ్డి దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద : కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతుల పొట్ట కొట్టే కార్యక్రమాన్ని మొదలు పెట్టిందని రైతుబంధు ఆపాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం పట్ల బిచ్కుంద మండలంలోని హస్గుల్ గ్రామంలో ఎంపీపీ అశోక్ పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటరావు దేశాయ్, గ్రామ


నిజాంసాగర్‌లో...

రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకుల దిష్టిబొమ్మను దహనం చేశారు.

సీఎం అల్పాహారం ప్రారంభం

నవతెలంగాణ-రాజంపేట్

మండల కేంద్రంలోని ప్రాథమిక, బాలిక పాఠశాలలో గురువారం సీఎం అల్పాహార పథకాన్ని డీఈఓ రాజు ప్రారంభించినట్టు ఎంఈఓ రామస్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీపతి రావ, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు మద్దతు

నవతెలంగాణ-రామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా కెసిఆర్ పోటీ చేస్తుండడంతో మండలంలోని అన్నారం యాదవ సంఘం సభ్యులు 62 మంది కేసీఆర్‌కు మద్దతు తెలిపారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో గురువారం కామారెడ్డిలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తెలంగాణ అభివృద్ధిని చూసి కుల సంఘాలు మద్దతు తెలుపుతున్నాయంటే, కెసిఆర్‌ను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్ రెడ్డి, మాచారెడ్డి ఎంపిపి నర్సింగరావు, మండల నాయకులు చిన్న రవీందర్‌రెడ్డి, స్వామిగౌడ్, కూడెల్లి బాలరాజు, కుక్కల రాజయ్య, కుమ్మరి మురళి తదితరులున్నారు.


బీఆర్ఎస్‌లో చేరిన యాదవ సంఘం సభ్యులు

గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని చిన్నమావంది, పెద్దమావంది తదితర గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి కార్యకర్తలతో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలతో అమలు చేసే మేనిఫెస్టోను ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మయ్య, కౌన్సిలర్ శరత్‌రెడ్డి, నాయకులు బీహారీ హనుమండ్లు, ఖాజాపూర్ అశోక్, వెంకటేష్, మందర్న రవి, రాహుల్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బిచ్కుంద

తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాదేపురం గంగన్న, రాష్ట్ర సహాయ కార్యదర్శి గోనె లాలయ్య, కార్యవర్గ సభ్యులు గైని భూమేష్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కమిటీని గురువారం బిచ్కుంద మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా మారుశెట్టి హన్మాండ్లు, ఉపాధ్యక్షులుగా నునావత్ లక్ష్మన్ నాయక్, కోటగిరి సతీష్, ప్రధాన కార్యదర్శిగా నల్లజెరు విఠల్, కార్యదర్శిగా మెత్రి హన్మాండ్లు, కోశాధికారి గాలిమే విఠల్, సహాయ కార్యదర్శిగా రాజు, సంయుక్త కార్యదర్శి సాయిలు, సలహాదారులుగా చింతల గంగాధర్, ఎర్రవట్టి పోశీరాం, జాదవ్ వీరన్న, వాగ్మారే గంగాధర్, అంబిల్‌పురి రాజు, కర్రేవార్ బాలాజీ, కార్యవర్గ సభ్యులుగా గోనె సురేష్, లింగంపేట్ సాయిలు, ఎల్లారెడ్డి బన్సీలాల్, జాదవ్ సుభాష్, ఎడ్ల మహేష్, డప్పు రమేష్‌ను ఎన్నుకున్నారు.


నూతన జిల్లా కమిటీ సభ్యులు

మేరి మట్టి, మేరీ దేశ్ ర్యాలీ

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం బోధన్ మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో మెరి మట్టి, మేరీ దేశ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కార్యాలయంలో చనిపోయిన సైనికుల కుటుంబ సభ్యులను సన్మానించారు. ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మధుకర్, ఈసీ అల్తాఫ్, ఉపాధిహామీ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం

నవతెలంగాణ-బోధన్

ఎడపల్లి మండలంలో గురువారం నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరుకావడంతో ఆమెను బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు ఆత్మెల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. పూల మొక్కను అందించారు. అనంతరం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో ఆత్మెల శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో బతుకమ్మ వేడుకలలో పాల్గొన్నారు.



మహిళా సమైక్య ఈసీ సమీక్ష సమావేశం

నవతెలంగాణ-రాజంపేట్

మండల మహిళా సమాఖ్య ఈసీ సమావేశాన్ని గురువారం నిర్వహించినట్టు డిపిఎం రమేష్ బాబు పేర్కొన్నారు. సంఘాల ఆర్థిక ప్రగతి, బ్యాంకు లింకేజ్‌లో ఎన్పీఏ రికవరీ, బ్యాంకు రుణ లక్ష్యం, న్యూఎంటర్ప్రైస్, పీఎం ఎఫ్ఎంఈ, సంస్థాగత నిర్మాణ కార్యక్రమాలు గురించి వివరించారు. సమావేశంలో ఏపీఎం సాయిలు, సీసీలు శ్రీనివాస్, సాయిలు, బాగయ్య, రమేష్, స్వామి, అకౌంటెంట్ ప్రశాంతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు.